

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | ఆదివారం | డిసెంబర్ 3, 2023 | www.navatelangana.com

- అభ్యర్థుల్లో టెన్షన్ టెన్షన్
- నేటి ఫలితాలపై పార్టీలు, అభ్యర్థుల్లో గుబులు
- గెలుపోటములపై గ్రామాలు, వార్డుల వారీగా లెక్కలు
- విజేతలెవరు..?పరాజితులెవరోనని తీవ్ర ఉత్కంఠ
- మధ్యాహ్నం లోపు ఫలితం వెల్లడయ్యే అవకాశం



టిక్..టిక్..టిక్..!

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఫలితం వెల్లడయ్యే సమయం రావడంతో అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే గ్రామాలు, వార్డుల వారీగా లెక్కలు వేసుకున్న అభ్యర్థులు విజయావకాశాలపై నమ్మకంతో ఉన్నారు. కానీ పోటీలో ఒకరికి మించి మరొకరు బలమైన అభ్యర్థులు ఉండటంతో గెలుపుపై ఆందోళనతో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే గెలుపోటములపై క్షేత్రస్థాయిలో పార్టీల కార్యకర్తలు, నాయకుల ద్వారా సమాచారం సేకరించిన అభ్యర్థులు వాటిని బేరీజు వేసుకున్నట్లు తెలుస్తోంది. ఫలితంపై ఇప్పటికే కొందరు అభ్యర్థులకు విజయమా..అపజయమా అనేది పూర్తి స్పష్టత వచ్చినా.. సైలెంట్ ఓటింగ్ ఉండటంతో ఫలితం తేలే వరకు విజయంపై నమ్మకంతో ఉన్నట్లు సమాచారం. మరికొందరు అభ్యర్థులు మాత్రం విజయంపై ఆశలు వదులుకున్నట్లు తెలుస్తోంది. మరోపక్క అధికార యంత్రాంగం ఆదివారం లెక్కింపు కోసం ఏర్పాట్లు సిద్ధం చేసింది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వీటి పరిధిలో 148 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్యనే పోటీ ఉంటుందని భావిస్తున్నా సిర్పూర్‌లో మాత్రం బీఎస్పీ ప్రభావం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పోలింగ్ జరిగిన రోజే ఆయా పార్టీల గెలుపోటములపై ఓ అంచనాకు వచ్చిన ప్రజలు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు విజయావకాశాలపై లెక్కలు వేసుకున్నారు. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయి..ఏయే వర్గాలు ఎవరికి వేశారు..? ఎన్ని ఓట్ల మెజార్టీ వస్తుంది..రాకపోతే ఎంతటితో ఓడిపోతాం.. తదితర వాటిపై చర్చలు సాగించారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల రెండు ప్రధాన పార్టీల మధ్యనే పోటీ ఉండగా.. మరికొన్ని చోట్ల మూడు పార్టీల మధ్య గట్టి పోటీ ఉంటుందని తెలుస్తోంది. మరోపక్క ఫలితాలపై ఎగ్జిట్‌పోల్‌లు వెల్లడించడంతో అభ్యర్థుల్లో మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. ఏ పార్టీ ఎగ్జిట్‌పోల్ ఫలితాలు చూసి సంబరపడితే..మరో

మిగతా..2లో...

నేడే ఫలితం..!

- ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- మధ్యాహ్నం లోపు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల క్రతువులో చివరి అంకమైన లెక్కింపు ప్రక్రియకు సమయం ఆసన్నమైంది. మరికొన్ని గంటల్లో ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. ఇందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆయా జిల్లా కేంద్రాల్లో ఇందుకు సంబంధించి లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో లెక్కించనున్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు సంబంధించి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీవీటీజీ బాలికల పాఠశాలలో లెక్కించనున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలకు సంబంధించి మంచిర్యాల జిల్లా ముల్కల్ల ఐజ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టనున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలకు సంబంధించి నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ క్రతువులో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

రౌండ్ల వారీగా ఫలితాలు..!

ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు

మిగతా..2లో...





ఆదిలాబాద్, మంచిర్యాలలో కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్లు రాహుల్‌రాజ్, బదావత్ సంతోష్

పట్టుబడిన మావోయిస్టు సాంకేతిక నిపుణల బృందం సభ్యులు

- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఇందారం గ్రామ పంచాయతీ నజీర్‌పల్లి శివారుల్లో ఇద్దరు మావోయిస్టు పార్టీ సాంకేతిక నిపుణుల బృందం సభ్యులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు పట్టుబడిన వారి వివరాలను శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి విలేకరులకు వివరించారు. ఇందారం గ్రామంలో గల ఓ ఇంట్లో సీపీఐ(మావోయిస్టు) టెక్నికల్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ టెక్నికల్ టీమ్ క్యాడర్ డి.గంగాధరరావు అలియాస్ నర్సన్న, బక్కన్న, వెంగో దాదాతో పాటు అతని భార్య డీవీసీఎం, సీపీఐఎం, డీకేఎస్ఐసీ భవానీ అలియాస్ సుజాత, శ్యామల ఉంటున్నట్లు అందిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందం ఇంటిని తనిఖీ చేసి పట్టుకున్నారు. గంగాధరరావు అలియాస్

మిగతా..2లో...

టిక్..టిక్..టిక్..!

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ వీటిని కొట్టిపారేస్తోంది. ఫలితాలు వెల్లడయ్యే వరకు పూర్తి స్పష్టత వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ..!

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆయా పార్టీలు, అభ్యర్థులు సుమారు నెలన్నర రోజులుగా తీరికలేని ప్రచారం నిర్వహించారు. డిసెంబర్ 30న పోలింగ్ సైతం ముగిసిపోవడంతో అప్పటి నుంచి ఫలితాలపై అనుచరులు, పార్టీ ముఖ్య నాయకులతో తీవ్ర చర్చలు సాగించారు. ఎక్కడెక్కడ ఏయే పార్టీలు ప్రభావం చూపించాయి.. ఏయే వర్గాలు ఎవరికి మద్దతిచ్చాయి. తదితర వాటిని బేరీజు వేసుకున్నారు. కేవలం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకే కాకుండా ఆయా పార్టీల ముఖ్య నాయకులు, క్షేత్రస్థాయి కార్యకర్తల్లోనూ తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది. జనాల్లోనూ ఫలితాలపై ఆసక్తి నెలకొంది. ఆదివారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు ప్రక్రియపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఇన్నాండ్లు వేచిచూసిన సమయం రావడంతో ఎవరు విజేతలవుతారు..?పరాజితులెవరో మధ్యాహ్నం వరకు వెల్లడయ్యే అవకాశం కనిపిస్తోంది. తాజా ఫలితాలతో రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా..లేదంటే మార్పు జరుగుతుందా అనే దానిపై తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటి వరకు ఎగ్జిట్‌పోల్‌లలో మెజార్టీ మాత్రం రాష్ట్రంలో మార్పు జరుగుతుందని చెబుతుండగా.. అధికార పార్టీ మాత్రం వాటిని నమ్మకూడదని చెబుతుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఏదేమైనా ఆదివారంతో ఈ ఉత్కంఠకు తెర పడనుంది.


ఆదిలాబాద్‌లో కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

నేడే ఫలితం..!

(మొదటి పేజీ తరువాయి)

ఉండగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. మంచిర్యాల సమీపంలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల ఓట్లు లెక్కిస్తారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజకవర్గాల ఓట్లు లెక్కించడానికి సిద్ధం చేశారు. పోలైన ఓట్లను పరిగణనలోకి తీసుకొని టేబుల్‌లు ఏర్పాటుచేశారు. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి 14 నుంచి 20కి పైగా రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 14టేబుల్‌లు ఏర్పాటుచేయగా 20 రౌండ్లలో లెక్కింపు చేపట్టనున్నారు. బోథ్ లెక్కింపు కోసం 14టేబుల్‌లు ఏర్పాటుచేయగా.. 22రౌండ్లలో లెక్కింపు చేపడుతారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం లెక్కింపు కోసం 14టేబుల్‌లలో 22రౌండ్లు, సిర్పూర్ కోసం 14టేబుల్‌లను 21రౌండ్ల లెక్కింపు చేపడుతున్నారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ లెక్కింపు కోసం 14టేబుల్‌లు ఏర్పాటుచేయగా 22 రౌండ్లలో చేపట్టనున్నారు. మంచిర్యాల నియోజకవర్గం లెక్కింపు 21 రౌండ్లలో చేపడుతారు. ఇందుకు 14టేబుల్‌లను ఏర్పాటుచేశారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల లెక్కింపు ప్రక్రియను 17రౌండ్లలో చేపట్టనుండగా ఒక్కోదానికి 14టేబుల్‌లు ఏర్పాటుచేశారు. ఉదయం 10 నుంచి 11గంటల వరకు తొలి ఫలితం వచ్చే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. మరోపక్క లెక్కింపు పకడ్బందీ చేపట్టేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటుచేస్తోంది.


కౌంటింగ్‌కు కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

పట్టుబడిన మావోయిస్టు సాంకేతిక నిపుణల బృందం సభ్యులు

(మొదటి పేజీ తరువాయి)

నర్సన్న, బక్కయ్య, వెంగో దాదా తండ్రి వెంకటరత్నం(80) ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డెల్టా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం ఇందారం గ్రామంలో ఉంటున్నాడు. అదేవిధంగా అతని భార్య భవానీ అలియాస్ శ్యామల(60) గంగాధరరావుతో కలిసి ఇందారంలోనే ఉంటోంది. జలంపల్లి బక్కయ్య, జలంపల్లి లక్ష్మి పేరులతో గల ఆధార్ కార్డులు, రూ.లక్షా57వేల900 నగదు స్వాధీనం చేసుకున్నారు. గంగాధరరావు నిషేధిత సీపీఐ(మావోయిస్టు) సాంకేతిక విభాగంలో కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నాడు. 1969లో వైజాగ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువు పూర్తి చేశాడు. భవానీ అలియాస్ సుజాత, శ్యామలను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె ఉంది. 1972లో జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లి అక్కడే ఆస్‌బెస్టాస్ తయారీ కంపెనీలో చేరి 1980 వరకు పని చేశాడు. అక్కడ మావోయిస్టు పార్టీ సిటీ కమిటీ ఆర్గనైజర్ విశ్వంతో పరిచయం ఏర్పడి మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై 1980లో పార్టీలో చేరాడు. 2000లో పార్టీ కేంద్ర కమిటీ సాంకేతిక విభాగం బాధ్యతలు అప్పగించింది. అందులో అతను ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీదారునిగా పని చేస్తూ వచ్చాడు. 10 నెలల క్రితం కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న ఆదేశాల మేరకు భార్య భవానీతో కలిసి పార్టీ అభివృద్ధి కోసం పార్టీ అర్బన్ నెట్‌వర్క్, పార్టీ బలోపేతానికి నిధులు, యువతను పెద్ద సంఖ్యలో ప్రేరేపించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ప్రభుత్వ వ్యతిరేకంగా కార్యకలాపాలకు ఇందారం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో ఎవరికీ అనుమానం రాకుండా జలంపల్లి బక్కయ్య, జలంపల్లి లక్ష్మి పేరుతో నకిలీ ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు తయారు చేసి ఆ పేర్లతో ఇందారంలో స్థలం కొనుగోలు చేసి చిన్న ఇల్లు నిర్మించుకున్నారు. అప్పుడప్పుడు వారు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సిరొంచకు వెళ్లి మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడైన చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్, బండి ప్రకాష్, బడె చొక్కారావు అలియాస్ దామోదర్‌తో కలిసి పార్టీ సమావేశాలకు హాజరవుతున్నారు. అదేవిధంగా తెలంగాణ, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో రెండు మూడు సంవత్సరాలుగా తిరుగుతూ మావోయిస్టు కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. కొద్ది నెలల క్రితం ఇందారం గ్రామానికి వచ్చారు. ఈయనకు సాయం చేసిన సీపీఐ(మావోయిస్టు) సానుభూతిపరుడైన చిప్పకుర్తి శ్రీనివాస్ పెంచికల్‌పేట్ మండలం కమాన్పూర్ నివాసి. ప్రస్తుతం పరారీలో ఉండగా, పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. పట్టుబడిన వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీపీ వివరించారు.


మావోయిస్టు దంపతులు నివాసముంటున్న ఇల్లు

కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 3వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి కౌంటింగ్ నిర్వహణ కొరకు నియమించిన సూపర్వైజర్లు, సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌంటింగ్ నిర్వహణలో కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకుల పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు తరలించే సమయంలో నిబంధనల ప్రకారం ఆయా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు సంబంధించినవి మాత్రమే తరలించాలని, కౌంటింగ్ కొరకు నియమించబడిన సిబ్బంది ఈ నెల 3వ తేదీ ఉదయం 6గంటలలోగా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, 8.30 గంటలకు ఈవీఎం లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. అభ్యర్థుల సంబంధిత ఏజెంట్ల సమక్షంలో పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ కౌంటింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఆర్డిఓ సురేష్, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులు పాల్గొన్నారు.





భాస్కర్ లొంగుబాటుపై దుష్ప్రచారాలు ఆపాలి

ఆసిఫాబాద్ : మావోయిస్టు నాయకుడు భాస్కర్ పోలీసులకు లొంగిపోతున్నారని స్క్రిప్ట్ వాయిస్ ఓవర్ చందు పరుశురాం మీడియా చేస్తున్న దుష్ప్రచారాలు ఆపాలని మావోయిస్టు పార్టీ మంగి, ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శి వర్గీస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భాస్కర్ మధ్యవర్తితో రాష్ట్ర పోలీస్ అధికారితో ఒక దఫా చర్చలు జరిపారని, త్వరలో లొంగిపోతున్నాడని దుష్ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. వీటిని నమ్మకూడదని పేర్కొన్నారు. రాష్ట్రంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పిలుపుమేరకు పలు గ్రామాలు ఆచరించాయని, దీన్ని సహించని పోలీసులు వారికి సంబంధించిన మీడియా మావోయిస్టులను చీల్చే కుట్ర చేస్తున్నారన్నారు. భాస్కర్ తమతోనే ఉన్నాడని, ఈ ప్రచారాలను ఖండిస్తున్నామని ఎవరు కూడా వీటిని నమ్మకూడదని పేర్కొన్నారు.

ఖమ్మంపల్లిలో ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దేవాలయ నిర్మాణానికి గాను కాగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ 10వేల రూపాయలను విరాళంగా శనివారం అందజేశారు. అనంతరం విరాళం అందించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆలయ కమిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6న గోదావరి హారతి

నవతెలంగాణ-గోదావరిఖని:
కార్తీక మాసంలో నిర్వహించే గోదావరి హారతి కార్యక్రమం ఈ నెల 6 బుధవారం సాయంత్రం 5 గంటలకు గోదావరిఖనిలోని సమ్మక్క సారలమ్మ ఘాట్ల వద్ద నిర్వహించనున్నామని గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కోకన్వీనర్ క్యాతం వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 12 సంవత్సరాలుగా ధార్మిక సంస్కృతిని భావితరాలకు చాటి చెప్పుటకు గాను గోదావరి తీరంలో పూర్వ ప్రాచీన వైభవాన్ని కొనసాగించుటకు ఆధ్యాత్మికతను పెంపొందించుటకుగాను పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహిస్తున్న గోదావరి హారతి కార్యక్రమానికి మహిళలంతా అధిక సంఖ్యలో హాజరై గోదావరి మాత ఆశీస్సులు పొందాలని కోరారు.



క్యాతం వెంకట రమణ

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట బందోబస్తు

- సీసీ కెమెరాలు ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ
- జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్
శాసనసభ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహణకు భద్రత పరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్లో శాసనసభ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి చేయవలసిన విధులపై బ్రీఫింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియను పటిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో పనిచేయడం వల్ల ఎలాంటి రీపోలింగ్ లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించామని దీనికి సహకరించిన అధికారులకు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విధుల్లో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసేలా నిబద్దతతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రభాకర రావు, భీమ్‌రావ్, జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ వెంకటస్వామి, రవీంద్రారెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కౌంటింగ్ నిర్వహణ ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-రామగిరి/మంథని
అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం రామగిరి మండల కేంద్రంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత కౌంటింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ కౌంటింగ్ పరిశీలకులు రామగుండం రాజేష్ సింగ్ రానా, మంథని సి.పి పటేల్, పెద్దపల్లి సీ.ఎన్ శ్రీధరలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు జేఎన్టీయూ కళాశాల బ్లాక్ 2 నందు జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ హాల్లో 14 కౌంటింగ్ టేబుల్, ఒక పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్ కౌంటింగ్ అసిస్టెంట్ ,మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3 రిజర్వ్ బృందాలు, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు బృందాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దని అన్నారు.కౌంటింగ్ కేంద్రానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, కౌంటింగ్ కేంద్రం లోపల ఎవరికి సెల్‌ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటి సంభాషణలు పెట్టుకోవద్దని, ప్రశాంతంగా వ్యవహరించాలని ఎట్టి పరిస్థితుల్లో ఆగ్రహానికి గురి కావద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జె అరుణశ్రీ, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్యామ్ ప్రసాద్ లాల్ , పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్.మధుమోహన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్

కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత

రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పెద్దపల్లి జిల్లాలో రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జేఎన్టీయూ కాలేజీ, అలాగే మంచిర్యాల జిల్లాలో హైజా ఇంజనీరింగ్ ముల్కల నిర్వహించడం జరుగుతుందని, ప్రజలందరూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎవ్వరూ కూడా టపాసులు కాల్చరాదని, టపాసులు కాల్చడం నిషేధించబడిందని తెలిపారు. కౌంటింగ్ ప్రాంతం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డు భద్రతా సిబ్బందికి చూపిస్తేనే కౌంటింగ్ కేంద్రానికి లోనికి ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఎవరైన ఈ నియమ నిబంధనలు పాటించకపోతే వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పోలీసు కిష్టయ్య ముదిరాజ్ ఘన నివాళి



కిష్టయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన పోలీసు కిష్టయ్య ముదిరాజ్ 14వ వర్ధంతిని రామగుండం ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కిష్టయ్య చిత్రపటానికి పూలమాలవేసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాలు ముదిరాజ్‌లకు సంక్షేమం పథకాలు అందజేయాలని, రాజకీయాలలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దబ్బెట శంకర్ ముదిరాజ్, కోశాధికారి గైక్వాడ్ రజనీకాంత్ ముదిరాజ్, సీనియర్ సలహాదారులు పూర్మ శ్రీనివాస్ ముదిరాజ్, పిడుగు కష్ణ ముదిరాజ్, నాయకులు తూడి రాజయ్య ముదిరాజ్, కేశవేణి బిక్షపతి ముదిరాజ్, జంగపల్లి కష్ణ ముదిరాజ్, గణవేన సంపత్ ముదిరాజ్, దండు రవి ముదిరాజ్, బోయిని కుమార్ ముదిరాజ్, శ్రీలం శ్రీనివాస్ ముదిరాజ్, శ్యామ్ ముదిరాజ్, సబ్బు చంద్రయ్య ముదిరాజ్, పిట్టల రవి ముదిరాజ్, దబ్బెట సాగర్ ముదిరాజ్, కలవేన చంద్రయ్య ముదిరాజ్, ఈరవేన లక్ష్మయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ షాపులు మూసివేయాలి



నవతెలంగాణ-రామగిరి
నేడు తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపు ఉన్నందున రామగిరి మండలంలోని జేఎన్టీయూ కళాశాల పన్నూర్ వద్ద లెక్కింపు జరుగుతున్నందున మంథని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లిక్కర్ షాపులు, బార్ షాపులు పూర్తిగా మూసి ఉంచాలని ఏరియా ఎక్సైజ్ సీఐ జి గురవయ్య తెలిపారు.

నేడే ఓట్ల లెక్కింపు

నవతెలంగాణ-మంథని
తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో భాగంగా మంథని నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి కావడంతో అధికారులు కౌంటింగ్‌కు పగడ్బందీ ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3న మంథని నియోజక వర్గంలోని పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపును మంథని జేఎన్టీయూ కాలేజీలో ఏర్పాటు చేశారు.మొదట బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో పాటు పోలింగ్ కేంద్రాలలో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు.

విద్యుత్ షాక్‌తో మేకపోతు మృతి

నవతెలంగాణ-రామగిరి



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని మేడిపల్లి శివారు తేట్టేకుంట ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో మేక పోతు మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న గడ్డిని మేస్తూ విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందిందని చంద్రయ్య తెలిపారు. మేకపోతు మృతి చెందం డంతో 20 వేల నష్టం వాటిల్లిందని తెలిపారు.

నేటి కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

శాసనసభ నియోజకవర్గ సాధారణ ఎన్నికలు 2023లో భాగంగా ఆదివారం మండలంలోపి ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను కౌంటింగ్ పరిశీలకులు మేజర్ సిద్దలింగయ్య ఎస్. హైర్ మత్‌తో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి 21 రౌండ్ల లెక్కింపు, ప్రతి టేబుల్ కు ముగ్గురు సిబ్బంది చొప్పున 14 టేబుల్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం అదనంగా 4 టేబుల్లు ఏర్పాటు చేశామన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గానికి 17 రౌండ్ల లెక్కింపు, ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది చొప్పున 14 టేబుల్లు ఏర్పాటు చేశామని, పోస్టల్ బ్యాలెట్ కోసం 2 టేబుల్లు ఏర్పాటు చేశామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గానికి 17 రౌండ్ల లెక్కింపు, ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది చొప్పున 14 టేబుల్లు, పోస్టల్ బ్యాలెట్‌కు 2 టేబుల్లు అదనంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల తరపున నియమించిన ఏజెంట్ల సమక్షంలో పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఉంటుందన్నారు. 3న ఉదయం 6 గంటల నుండి 144 సెక్షన్ అమలులో ఉంటుందని, భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సంబంధిత ఫోటో గుర్తింపు కార్డు ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతి ఉంటుందన్నారు. మొబైల్ తో పాటు నిషేధిత వస్తువులు, పరికరాలు కౌంటింగ్ హాల్ లోనికి అనుమతిస్తామన్నారు. అభ్యర్థుల తరపున నియమించిన ఏజెంట్లు కౌంటింగ్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) బి. రాహుల్, జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాములు, చెన్నూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బందికి రెండో ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ అశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వారిగా రెండో ర్యాండమైజేషన్ మెహదాబ్ సింగ్ గుర్జార్ పరిశీలకుల సమక్షంలో ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి రెండో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ప్రక్రియ పూర్తి చేసి స్క్రీన్ ద్వారా చూపించారు. జిల్లాలో మూడు నియోజకవర్గాలు నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలోని కౌంటింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే సూపర్‌వైజర్‌లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్స్‌ని, కేటాయించారు. మూడు నియోజకవర్గాల వారిగా కౌంటింగ్ కేంద్రాలకు 200 మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. సిబ్బందికి మాస్టర్ శ్రీనివాస్ శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. నిర్మల్-68, ముధోల్-66, ఖానాపూర్-66, పోలింగ్ కేంద్రాలకు 200 టీమ్స్‌ను కేటాయించడం జరిగిందని అన్నారు. అనంతరం కౌంటింగ్ ఏర్పాట్లపై కౌంటింగ్‌కు కేటాయించిన సిబ్బందితో మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ సాయుధ బలగాల పహారా 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు, కౌంటింగ్ ప్రక్రియ, నిర్మల్ నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, 22 రౌండ్స్, ముధోల్ నియోజకవర్గంలో 312 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, 22 రౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాల్లో 14 టేబుల్స్, 22 రౌండ్స్, ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి ఉంటుందని తెలిపారు. కేటాయించిన సిబ్బంది ఉదయం 5.30 గంటలలోపు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సమావేశంలో సంబంధిత అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పోలింగ్ ముగిసి ఓట్లు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ రోజు ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పార్టీల కార్యకర్తలు కౌంటింగ్ కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడుతారో నేడు తేలనుండటంతో పార్టీల అభ్యర్థులు మండలాల వారిగా ఏజెంట్లను సమకూర్చు కున్నారు. ఎవరికి వారుగా అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వారిలో పూర్తిస్థాయి విశ్వాసంతో కనిపించడంలేదు. ఖానాపూర్ నియోజక వర్గంలో ప్రధానంగా బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేష్, కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు, బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్‌ల మధ్యనే పోటీ కనిపిస్తోంది. వీరిలో ఎవరు గెలిచినా స్వల్ప ఆధిక్యం మాత్రమే ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ఈసారీ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను పక్కన బెట్టి కేటీఆర్ తన మిత్రుడైన జాన్సన్ నాయక్‌కు టికెట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కేటీఆర్ మిత్రుడు అనే అంశాన్ని ప్రధానంగా తెరపైకి తెచ్చి ప్రచారం చేశారు. జాన్సన్ గెలిస్తే కేటీఆర్ గెలిచినట్టేనని, దీంతో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతుందని కేసీఆర్ సైతం గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

మార్పును కోరుకున్నారా..?

పదేండ్లు పాలించిన ప్రభుత్వాన్ని మార్చకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసింది. తమ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జు నిరుపేద ఆదివాసీ బిడ్డ అని ప్రజల్లో సానుభూతి కలిగించే ప్రయత్నం చేశారు. జాతీయ స్థాయి నాయకురాలు ప్రయాంకను సైతం రప్పించి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అనుకుంటున్నట్టుగా నియోజకవర్గ ప్రజలు మార్పును కోరి ఓటేశారా.. అనేది నేడు తేలనుంది.

బీజేపీ పాగా వేసేనా..?

ఖానాపూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు గెలిపొందారు. ఇక్కడ బీజేపీ అంటే మొదట అంతగా ప్రభావం ఉండదని అందరూ భావించారు. ఎన్నికలు దగ్గర పడిన కొద్ది ఓటర్లలో మార్పు కనిపించినట్లు ఆపార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అభ్యర్థి రాథోడ్ రమేష్ అనుభవం, బండి సంజయ్ పర్యటన తమ పార్టీకి కలిసివచ్చిందన్న ధీమాతో ఉన్నారు. ముగ్గురిలో ఖానాపూర్ ప్రజలు ఎవరికి పట్టం కట్టారో నేడు తేలిసిపోనుంది.

పొంగులేటిని సీఎంగా ప్రకటించాలి



నవతెలంగాణ-మందమర్రి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సీఎంగా ప్రకటించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చిలుక సంతోష్ డిమాండ్ చేశారు. మందమర్రి ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిలుక సంతోష్ మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టిన ఖమ్మంలో నిర్వహించిన కాంగ్రెస్ సభను విజయవంతం చేయడంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ శ్రీనివాస్ రెడ్డి చేసిన కృషిని గుర్తించి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ప్రకటించాలని కోరారు. పొంగులేటి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాతే చేరికలు పెరిగాయని, తెలంగాణ ఉద్యమకారులు డా.పిడమర్తి రవి, నల్లాల ఓదెలు, గడ్డం వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు, వేముల వీరేశం ఇలా అనేక మంది పార్టీలో చేరారని తెలిపారు. వీరందరి చేరికలతోనే కాంగ్రెస్ పార్టీ బలపడి అధికారంలోకి వచ్చే అవకాశం ఏర్పడిందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని శ్రీనివాస్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ మంచిర్యాల జిల్లా యూత్ అధ్యక్షులు ఉప్పులేటి శేఖర్, కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

బోథ్ పీఠంపై ఎవరు..?

నవతెలంగాణ-తాంసి

బోథ్ ఎమ్మెల్యే పీఠంపై ఎవరు అనే దానిపై ఉత్కంఠ నేలకొంది. అందరూ ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నారు. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపెవరిది అనే దానిపై చర్చ కొనసాగుతుంది. బోథ్‌లో ఎవరు గెలుస్తారని అభ్యర్థుల్లో కార్యకర్తల్లో టెన్షన్ మొదలైంది. కాంగ్రెస్ అధికారం చేపట్టడానికి మెజార్టీ స్థానాలు వస్తాయని పలు సర్వే సంస్థలు తెలుపుతున్నాయి. అదేవిధంగా మరికొన్ని సర్వేలు బీఆర్ఎస్‌కు గెలుచే ఛాన్స్ ఉందని తెలిపాయి. అయితే బోథ్ నియోజకవర్గంలో మూడు ప్రధానమైన పార్టీల బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్, బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు, కాంగ్రెస్ అభ్యర్థి ఆడే గజేందర్‌ల మధ్య ఎవరు గెలుస్తారనే టాఫ్ ఫైట్ కనిపిస్తోంది. బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి పీఠం ఎవరు సొంతం అవుతుందో ఫలితాలు వెల్లడి అయ్యేంత వరకు వేచిచూడాల్సిందే.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలోని చాంద(టి) గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద(టి) గ్రామానికి చెందిన గొంగిళ్ల సంతోష్(40) నవంబర్ 29న ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగులమందు తాగాడు. అది గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో అంకోలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వంచినట్టు పీహెచ్‌సీ వైద్యుడు సర్పరాజ్ తెలిపారు. పాఠశాలలోని 106 మంది విద్యార్థులను పరీక్షించారు. జలుబు, జ్వరం, దురద ఉన్న విద్యార్థినులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు సూచించారు. నిత్యం చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. చలి కాలంలో శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. విద్యార్థులు వ్యాధులను రక్షణ పొందేల తాము చేసే సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, ఆరోగ్య సహాయకులు పవర్ ప్రేమ్ సింగ్, ఆశ కార్యకర్త రుక్మిణి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీదుర్గా గోల్డ్ వర్క్ షాప్‌లో అర్ధరాత్రి చోరీ



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని శ్రీదుర్గా గోల్డ్ వర్క్ షాప్‌లో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు చొరబడి ఒక తులం బంగారం అరకిలో వెండి పలు విలువైన సామాగ్రి ఎత్తుకెళ్లినట్లు దుకాణ యజమాని సతీష్ తెలిపారు. చోరీకి గురైన వాటి విలువ దాదాపు రూ.95వేలు నుంచి లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధిత యజమాని సతీష్ తెలిపారు. వెంటనే దుకాణ యజమాని సతీష్ కడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సమీప దుకాణాల సీసీ కెమెరాలలో వీడియో ఫొటోస్ కొరకు తనిఖీలు చేపడుతున్నారు. నిందితులను పట్టుకొని తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



నవతెలంగాణ-కడెం

మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి వారి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ముక్కెర గంగాధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి అధిక తూకాన్ని అరికట్టాలని రైతులకు అందుబాటులో గన్నే బ్యాగులను ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వాహనాలను, రైతులకు సమకూర్చాలని వారు కోరారు. జిల్లాలో వర్షాలు వచ్చే సూచనలు ఉన్నాయి. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని వారన్నారు. సుతిల్ తాడు, అమాలి ఖర్చులు ప్రభుత్వమే భరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

ఊరేగింపులకు అనుమతి తప్పనిసరి : సీఐ నవీన్ కుమార్




నవతెలంగాణ-లక్ష్మణచాంద

నేడు అసెంబ్లీ ఫలితాలు వెల్లడి కానున్నాయి. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సోన్ సర్కిల్ సీఐ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సోన్, లక్ష్మణచాంద, మామడ మండలాల్లోని ప్రజలు నలుగురు కన్నా ఎక్కువ గుమిగూడి ఉండటం కానీ, ఊరేగింపులు జరుపడం కానీ, బాణసంచాలు కాల్చడం కానీ, డీజే సిస్టమ్స్ పెట్టడం కానీ, బ్యాండు, డప్పులతో ఊరేగింపులు జరుపడం గాని నిషేదించబడినదని సీఐ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఊరేగింపులు జరుపవద్దని, కౌంటింగ్ అయిపోయిన తర్వాత ఊరేగింపుల అనుమతులు వచ్చిన తర్వాత మాత్రమే ఊరేగింపులు జరుపుకోవాలని సూచించారు. ప్రజలు అందరు పూర్తిగా సహకరించాలని కోరారు.

ఫలితాలపై అభ్యర్థుల్లో టెన్షన్ టెన్షన్

- జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



కౌంటింగ్‌కు టెబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల కోడ్ ప్రారంభం నుంచి గత నెల రోజులుగా అసెంబ్లీ ఎన్నికల హడావిడి వాడివేడిగా కొనసాగింది. అభ్యర్థుల నామినేషన్లు, తిరస్కరణలు, విత్‌డ్రాలు, పార్టీలలో చేరికలు, ప్రచారాలతో పాటు పోలింగ్ ప్రక్రియ సైతం పూర్తిచేసుకుంది. ప్రస్తుతం ఆదివారం ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపుతో తుది ఫలితాలు వెలువడనున్నాయి.

ఫలితాలపై అభ్యర్థుల్లో హైటెన్షన్ ...

నిర్మల్ జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో నిర్మల్, ముధోల్, ఖానాపూర్, నియోజకవర్గాలు వస్తాయి. కాగా ఆదివారం కౌంటింగ్ ప్రక్రియతో ఫలితాలు వెలబడనున్నాయి. దీంతో మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు, ప్రధాన పార్టీల అభ్యర్థులలో హైటెన్షన్ నెలకొంది. ఎవరి అంచనాలు వారికి ఉన్నప్పటికీ, ఓటరు నాడి తెలియకపోవడంతో తుది ఫలితాలపై అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. మొత్తానికి ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు ఎంత మెజార్టీ వస్తుందని తేలనుంది.

కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి..

నిర్మల్ జిల్లాలో మూడు నియోజకవర్గాలైన నిర్మల్, ముధోల్, ఖానాపూర్ సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే పూర్తి భద్రతతో పోలింగ్ సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు స్ట్రాంగ్ రూములకు తరలించారు. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. కౌంటింగ్‌లో భాగంగా 22 రౌండ్లు కోసం 14 టేబుల్ ఏర్పాటు చేశారు. అలాగే ఓట్ల లెక్కింపు కోసం అధికార, యంత్రాంగం సన్నద్ధమయ్యారు. మొదటగా పోస్టర్ బ్యాలెట్ సంబంధించిన ఓట్ల లెక్కింపుతో ఈ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కాగా 22 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరగనుంది. భద్రత విషయానికొస్తే ఓటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లను చేశారు. మద్యం దుకాణాలు మూసివేతతో పాటు, ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు అధికారులు ఇప్పటికే వెల్లడించారు. అనుమతి లేనిది ర్యాలీలు, టపాసులు పేల్చడం, సభలు నిర్వహించడం ఎన్నికలకు విరుద్ధమని వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఖానాపూర్‌లో విజయం ఎవరిని వరించేనో..?


- నేడే ఫలితాల వెల్లడి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఖానాపూర్ నియోజకవర్గం బాద్‌షా ఎవరని ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారు. గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్, కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్, బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేష్ ఎన్నికల బరిలో ఉన్నారు. ముఖ్యంగా ఈ ముగ్గురు అభ్యర్థుల మధ్యనే త్రిముఖ పోటీ నెలకొందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముగ్గురు సైతం తమదైన శైలిలో తాను గెలుస్తానని ఎవరి ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండలాల వారిగా, వివిధ పోలింగ్ స్టేషన్‌ల వారిగా పోలైన ఓట్లు, తమ తమ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయని బేరీజు వేసుకుంటున్నారు. ఇక్కడి ఎగ్జిట్ ఫలితాలు సైతం అంచనా వేయలేక పోతున్నాయి. ఎప్పుడు లేనంత ఈ ఎన్నికలో వివిధ సామాజిక వర్గాల వారిగా ఓట్లు పోలైనట్టు తెలుస్తోంది. ఖానాపూర్ నియోజకవర్గంలో పెంబి, ఖానాపూర్, కడెం, దస్తురాబాద్, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలు వస్తాయి. ఆయా మండల కేంద్రాల్లో ఓటింగ్ ఒక వైపు ఉండగా వివిధ గ్రామాల్లో మాత్రం సామాజిక వర్గాల వారిగా ఓటింగ్ జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,20,526 ఓటర్లు ఉండగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 1,72,412 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 78.18శాతం ఓటింగ్ నమోదైంది.







ఇంద్రవెల్లి మండలంలో మొత్తం 30,893 ఓటర్లు ఉండగా 24,801 ఓట్లు పోలయ్యాయి. వివిధ పార్టీల నాయకులు మండలాలు, వివిధ గ్రామాల వారిగా తమకు పోలైన ఓట్ల సరళిపై లెక్కలు వేడుకుంటున్నారు. తాను గెలుస్తానంటే తాను అంటు ఎవరి ధీమా వారే వ్యక్తం చేసుకుంటున్నారు. 2018 శాసనసభ ఎన్నికలో అజ్మీరా రేఖా నాయక్ ఇరవైవేలపై చిలుకు మెజారిటీతో గెలుపొందింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత నిరంతరంగా రెండు సార్లు గెలిచిన బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందా..! లేదా ఇతర పార్టీల అభ్యర్థులు విజయ ఢంకా మోగిస్తారా వేచి చూడాల్సి ఉంది.

ఆశాలకు ఎన్నికల విధుల పారితోషికం ఇవ్వాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేసిన ఆశాలు

నవతెలంగాణ-నిర్మల్

ఆశాలకు ఎన్నికల విధుల పారితోషకం తప్పనిసరిగా ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.గంగామణి అన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట పారితోషకం కోసం ఆశ వర్కర్లు ఎదురు చూశారు. డీఎంహెచ్‌ఓ ధనరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆశ వర్కర్స్ నిర్మల్ జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 30న ఆశ వర్కర్స్ ఎన్నికల విధులు అందరు ఉద్యోగులతో సమానంగా ఉదయం 7గంటల నుంచి, సాయంత్రం 6గంటల వరకు పని చేశారని అన్నారు. కాని ఆ విధులకు సంబంధించిన పారితోషకం ఇవ్వకుండా పంపారని అన్నారు. రాష్టంలో ఇప్పటికే కొన్ని జిల్లాలలో ప్రతి ఆశాకు రూ.550 ఇచ్చారన్నారు. మరి నిర్మల్ జిల్లాలో ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. వెంటనే రూ.550 ఇవ్వాలని అన్నారు. అలాగే కంటి వెలుగు పారితోషకం ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ఈ అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు విజయ, భాగ్య, సభ్యులు సరిత, ఇంద్రమాల, సుశీల, విజయ, లక్ష్మి, కమల, సుగుణ, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మగ్గ తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం డిసెంబర్ 03, 2023

ఈ నెలలో బర్డ్‌వాక్ నిర్వహిస్తాం

నవతెలంగాణ-బెజ్జూరు


ఈ నెల చివరి వారంలో బెజ్జూరు, పెంచికల్‌పేట్, సిర్పూర్ కాగజ్‌నగర్ రేంజ్‌లో బర్డ్‌వాచ్ కార్యక్రమం నిర్వహిస్తామని సీఎఫ్ శాంతారాం తెలిపారు. శనివారం మండలకేంద్రంలో సంబంధిత అటవీ శాఖ రేంజ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవన విధానం, సంస్కృతి, అటవీ ప్రాంతాలను పక్షి ప్రేమికులు వీక్షించే విధంగా ఈ బర్డ్‌వాచ్ కార్యక్రమం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని నలుమూలల నుండి పక్షి ప్రేమికులు వస్తారని ఆయన తెలిపారు. అనంతరం అంబగట్ట అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ టిబ్రివాల్, ఎఫ్‌డీఓ వేణుబాబు, ఎఫ్ఆర్ఓలు వేణుగోపాల్, దయాకర్, చంద్రమౌళి, పూర్ణచంద్, డిప్యూటీ ఆర్ఓ శ్రావన్‌కుమార్ ఉన్నారు.

నేటి కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

- మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- విజయోత్సవ ర్యాలీలకు అనుమతి నిరాకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించి జిల్లా కేంద్రాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ ప్రక్రియకు సంబందించిన ఏర్పాటు పూర్తి చేశారు. లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ బొర్కాడే హేమంత్ తోపాటు, ఎన్నికల పరిశీలకులు మహిపాల్, రాహుల్ రంజన్, రెండు నియోజకవర్గాల ఆర్వోలు దీపక్ తివారి దాసరి వేణులు పర్యవేక్షిస్తుండగా, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.



కౌంటింగ్‌కు 19 బృందాలు 14 టేబుళ్లు

జిల్లా కేంద్రంలో రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల కౌంటింగ్ చేయనున్నారు ప్రతి నియోజకవర్గానికి 19 చొప్పున కౌంటింగ్ బృందాలు ఏర్పాటు చేయగా, 14 కౌంటింగ్ టేబుల్స్, 3 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్ల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి టేబుల్ కు 1 సూపర్‌వైజర్, 1 కౌంటింగ్ అసిస్టెంట్, 1 మైక్రో అబ్జర్వర్ చొప్పున టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 22 రౌండ్లలో ఫలితం వెలువడనుండగా, సిర్పూర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం 21 రౌండ్లు కేటాయించారు.

మూడంచల భద్రత వ్యవస్థ ఏర్పాటు

జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించడానికి మూడు అంచల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశారు. డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ బృందాలతో పాటు, ప్రత్యేక భద్రత దళాలు భద్రత కోసం ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎన్నికల కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులు లేని వారిని లోపలికి అనుమతించేది లేదని తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతల విఘాతానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌంటింగ్ కేంద్ర వద్ద అగ్నిమాపక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు.



విజయోత్సవ ర్యాలీలకు నో అనుమతి

కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు తీసుకోవడానికి ఎన్నికల నిబంధన మేరకు పోలీసులు అనుమతి లేదని ప్రకటించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత 24 గంటల వరకు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు తీసుకోకూడదని తెలిపారు.









ఆసిఫాబాద్ అడ్డా ఎవరిదీ..?

- నేడు మధ్యాహ్నం వరకు ఫలితాలు
- ఓటేసిన 1,83,534 మంది ఓటర్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చేసింది. ఆరు నెలల కాలం నుండి ప్రధాన పక్షంతో పాటు ప్రతిపక్షాలు కూడా ఓటర్లను ఆకర్షించుకోవడం తాము అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలు లాంటి వాటితో ప్రజలతో మమేకమయ్యారు. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి అభ్యర్థుల ఖరారైన తర్వాత గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు. గురువారం ఎన్నికలు పూర్తి కావడంతో నేడు ఆదివారం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం వరకు అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఎవరి ధీమాలో వారు ఉన్న అభ్యర్థులకు ఫలితాలు వెలువడితే ఆసిఫాబాద్ నియోజకవర్గం అడ్డ ఎవరిది అనేది, ఓటర్లు ఎవరి వైపు నిలిచారనేది తేలనుంది.

నియోజకవర్గంలో విభిన్న తీర్పు

నియోజకవర్గంలో ఓటర్లు మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే కొంత వైవిధ్యతను చూపిస్తారనేది గత రెండు ఎన్నికల్లో కనిపించింది. 2019లో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవగా ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రంసక్కు గెలుపొందారు. నియోజకవర్గంలో ఎస్టీల ఓట్లు అధికంగా ఉండడం వారిలో ఆదివాసీల ఓట్లు 63 వేల వరకు ఉండడంతో అభ్యర్థులు ఎక్కువగా వీటిపైన ఆధారపడి తమ ప్రచారాన్ని కొనసాగించారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ తోపాటు బీజేపీ వైపు ఓటర్లు మొగ్గినట్లు కొంత వైవిధ్యం కనిపించగా, మండల







కేంద్రాలలో పాటు మండలాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ తోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థి విజయ్ కూడా కొంత ప్రభావం చూపే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ పవనాలు వీస్తున్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కూడా పెద్ద మొత్తంలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుస్తున్నారని సర్వే రిపోర్టులు వస్తున్నందున ఆసిఫాబాద్ ఓటర్లు కూడా రాష్ట్రంలో ఉన్న ఓటర్లను అనుసరించారా లేదా తన వైవిధ్యతను చాటారా అనేది నేడు తెలనుంది.

నేడు మధ్యాహ్నం వరకు తేలనున్న ఫలితం

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం 19 మందితో బృందాన్ని ఏర్పాటు చేయగా, 14 ఓట్ల లెక్కింపు టేబుళ్లను, 3 పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ లను ఏర్పాటు చేశారు. మొత్తం 22 రౌండ్లుగా ఓట్లను లెక్కిస్తారు. అయితే ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ 8:30కు పూర్తికాగా, సాధారణ ఓట్ల లెక్కింపు 8:30కు ప్రారంభమవుతుంది. ఏది ఏమైనా మధ్యాహ్నం వరకు ఫలితం తేలే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. గత ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కొంత రసభాసాగా మారి ఫలితం రావడానికి సాయంత్రం 6 గంటలయింది. దాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

ఓటింగ్‌లో పాల్గొన్న 1,83,534 మంది ఓటర్లు

గురువారం జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,26,664 ఉండగా వీరిలో పురుషులు 1,12,899 మహిళలు1,13,748 ఉండగా గురువారం ఎన్నికల్లో 1,83,534 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు వీరిలో పురుషులు 92,591 మంది ఉండగా, స్త్రీలు 90,940 ఉన్నారు. వీరంతా ఇచ్చిన తీర్పు ప్రస్తుతం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. నేడు ఓటర్ల మనోగతం, అభ్యర్థుల భవితవ్యం బయటపడనుంది. అభ్యర్థుల్లో మాత్రం టెన్షన్ నెలకొంది.

సమస్యలను న్యాయస్థానాల్లో పరిష్కరించుకోవాలి

- కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ్‌నాయక్
- హతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుటుంబాల మధ్య సమస్యలు ఉంటే న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని క్షణికావేశాలకు లోను కాకూడదని కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ్ నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన రెండు హత్యల కుటుంబాలను ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకుని అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకరినొకరు హత్య చేసుకోవడం సరైనది కాదని తెలిపారు. సమస్యలు ఉంటే న్యాయస్థానాల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. త్వరితగతిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అసిఫ్, జిల్లా నాయకురాలు ఇరుకుల్ల మంగ పాల్గొన్నారు.

మండలంలో 5వరకు 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-జన్నారం

జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 5వ తేది వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై పి.సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పార్టీల కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులు విజయోత్సవ ర్యాలీలు, బీజేలకు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు. ఆదివారం ఉదయం నుండి ఎన్నికల లెక్కింపు కార్యక్రమం పూర్తయిన తరువాత ఎవరైనా ర్యాలీలు నిర్వహిస్తే ఎన్నికల నిబందనల మేకరు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మధ్యం అమ్మకాలపై కూడా నిషేధం విధించారమన్నరు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయినీ తెలిపారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యలపై పీఆర్‌టీయూ ఎనలేని పోరాటం

నవతెలంగాణ-జన్నారం

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పీఆర్‌టీయూ పనిచేస్తుందని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, జన్నారం మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి అన్నారు శనివారం మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో గెజిటెడ్ హెడ్మాస్టర్ల ప్రమోషన్స్‌ను, మల్టీ జోన్ ఒకటిలో ఇప్పించిన ఘనత పీఆర్టీయూ సంఘం అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మన ఊరి మనబడి కార్యక్రమం ద్వారా, విద్యార్థులను, సంఖ్య గణనీయంగా పెరిగింది అన్నారు. ఇటీవల బదిలీలైన ఉపాధ్యాయులకు రిలీవ్ ఆర్డర్లను ఇప్పించుటకు సంఘం ఎంతో కృషి చేస్తుందన్నారు. 317 జీవోలో నష్టపోయిన ఉపాధ్యాయులకు, న్యాయం జరిగే విధంగా కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ ఉన్న మెడికల్ బిల్లులను ఇప్పించడానికి ఈ సంఘం పోరాటం చేస్తుందన్నారు., సీపీఎస్‌ను రద్దు చేయడానికి ఈ సంఘం పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. ఇటీవల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన, కట్ట రాజమౌళి గొల్ల రామన్న, అజయ్ శ్రీనివాస్‌లను పీఆర్టీయూ ఆధ్వర్యంలో శాల్వా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉపాధ్యాయులు నగరు సత్యం, గొల్ల రామన్న, శ్రీనివాస్, అజయ్ కుమార్, రాజారావు మురళి, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట కోర్టులో శతాబ్ది ఉత్సవాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట కోర్టులో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం కోర్ట్ ఏర్పడి వంద సంవత్సరా పూర్తి చేసుకున్న సందర్భంలో జడ్జి అసదుల్లా షరీఫ్ న్యాయవాదులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించారు. అందరూ బాధ్యతగా బాగస్వాములు కావాలని, వృత్తిని క్రమశిక్షణతో విజయవంతం చేయాలని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు చట్టాలను వివరించి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దారి పొడవు ధాన్యం రాసులు

నవతెలంగాణ-జైపూర్

నిన్న మొన్నటి వరకు పంట సాగులో నిమగ్నమైన రైతు ఇప్పుడు పండించిన పంటను అమ్ముకోవడం కోసం ఆరాటపడుతున్నాడు. వారం పది రోజుల నుంచి వరి కోతులు కొనసాగుతుండగా ధాన్యం అమ్ముకోవడం కోసం పండించిన ధాన్యం ఆరబోసుకుంటున్నారు. ఎక్కడ చూసినా వరి ధాన్యం రాసులు పోసి కన్పిస్తుండగా ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. ప్రభుత్వ పరంగా ఏ గ్రేడ్ వరి ధాన్యం క్వింటాలు రూ. 2,203 కామన్ గ్రేడ్ క్వింటాలు రూ.2,183 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. సివిల్ సప్లై ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ ద్వార స్వయం సహాయక సంఘాలు, డీసీఎంఎస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో 265 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరి ధాన్యం జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో పంటల సాగు దిగుబడి దృష్టితో ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది ఏర్పడకుండా నిర్వాహకులకు తగు సూచనలు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు నిల్వ లేకుండా కొనుగోళ్లు చేసిన ధాన్యం మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా మధునం పోచమ్మ జాతర

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని జనగామ గ్రామంలో మధునం పోచమ్మ బోనాల జాతర శనివారం సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు గ్రామంలోని భక్తులే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర, నుండి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. గ్రామాల నుంచి ఆడపడుచులు బోనమెత్తుకొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గట్టు లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ తరతరాల నుంచి ఆచారంగా వస్తున్న బోనాల పండుగను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా ఈ జనగామ మధురం పోచమ్మకు ప్రత్యేక స్థానం ఉందని అందుకే పొరుగు రాష్ట్రాల నుంచి కూడా జనం తరలివస్తారని అన్నారు.

ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం

- ముల్కల్ల ఐజా కాలేజీలో లెక్కింపు
- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్
- మధ్యాహ్నం వరకు ఫలితాలు విడుదల
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నవతెలంగాణ-హాజీపూర్

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఆదివారం పూర్తి చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు హాజీపూర్ మండలంలోని ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాట్లు చేశారు. రాత్రి వరకు బ్యాలెట్ బాక్సులు కౌంటింగ్ కేంద్రానికి చేరాయి. స్ట్రాంగ్ రూముల వద్ద ముడెంచల భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దత్తా, సజ్జన్.అర్‌లు కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. డీసీపీ రాంనాథ్ కేకైన్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాల సహాయంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రౌండ్ల వారీగా లెక్కింపు

జిల్లాలోని మూడు నియోజకవర్గా లైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకు రౌండ్ల వారీగా ఏర్పాట్లు చేశారు. మంచిర్యాల నియోజకవర్గానికి 21 రౌండ్లు,14 టేబుల్స్, చెన్నూర్ 17 రౌండ్లు 14 టేబుల్స్, బెల్లంపల్లి 17 రౌండ్లు 14 టేబుల్స్‌లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదట పోస్టల్ బ్యాలెట్‌లతో మొదలవుతుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం బెల్లంపల్లి-2, చెన్నూర్-2, మంచిర్యాల-4 టేబుల్‌లు ఏర్పాటు చేశారు. లెక్కింపు కోసం కేటాయించిన సిబ్బందికి కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లెక్కింపు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.

300 మంది సిబ్బంది..

లెక్కింపు ప్రక్రియలో బాగంగా మూడు నియోజక వర్గాలకు గాను 300లకు పైగా సిబ్బందిని కేటాయించారు. వీరు కాక 500 మందికిపైగా పోలీస్ బలగాలతో భద్రత ఏర్పాట్లు పూర్తి చేశారు. మీడియా పాయింట్‌లో టీవీలు ఏర్పాటు చేశారు. సిబ్బంది కోసం బోజన వసతులు ఏర్పాట్లు చేశారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ

జిల్లాలోని మూడు నియోజక వర్గాలైనా మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లిలో ప్రధానంగా కాంగ్రెస్, బీఅర్ఎస్, బీజేపీ మధ్యలోనే పోటీ నెలకొంది. మంచిర్యాల నియోజకవర్గంలో బీజేపీ ప్రభావం ఎక్కువ ఉండడంతో వుత్కంట నెలకొంది. ఇక చెన్నూర్, బెల్లంపల్లిలో కాంగ్రెస్ బీఅర్ఎస్ మధ్యే పోటీ ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మంచిర్యాలలో ఎక్కువ ఓట్లు ఉండడంతో తుది ఫలితం కోసం సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే. ఇక చెన్నూర్, బెల్లంపల్లి ఫలితాలు మధ్యాహ్నం వరకు పూర్తికానున్నట్లు తెలుస్తోంది.

నేడే వెలువడనున్న అభ్యర్థుల భవితవ్యం

- గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే..
- ఫలితాల కోసం ఎదురు చూపులు





నవతెలంగాణ-జైపూర్

ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం ఆదివారం మధ్యాహ్నం వెలువడనుంది. నువ్వా..నేనా అన్నట్లు పోటీపడిన కాంగ్రెస్ బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటర్ల తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. చెదురుమొదురు సంఘటనలు మినహా 79.9 పోలింగ్ శాతం నమోదు చేసుకున్న చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అవకాశం ఇవ్వాలని కోరుతూ ప్రచారం చేసిన కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి, అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని కోరిన బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ గెలుపోటములపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు పోలింగ్ కొనసాగుతుండగానే మరో వైపు ఎగ్జిట్ పోల్స్ బయటకు రావడం తెల్సిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సర్వే సంస్థలు వెల్లడించిన తీరుతో రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీకే దక్కిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అదేవిదంగా బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తున్నారని సర్వే సంస్థలు వెల్లడించడంతో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆనందోత్సవాల్లో మునిగి తెలుతున్నారు. ఇదిలావుండగా పోలింగ్‌కు మూడు రోజుల బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెన్నూర్ నియోజకవర్గం ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని మళ్లీ ఎమ్మెల్యేగా తానే గెలువబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో మూడవ సారి బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని కేసీఆర్ మూడవ సారి మళ్లీ సీఎం సీటులో కూర్చోబోతున్నారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నియోజకవర్గం పరిధిలో గల 227 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఆర్ఎస్ కారు గుర్తుకే అధికంగా ఓట్లు పోలైనట్లు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ధీమా ఉన్నారు. గతంలో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తారుమారు చేస్తూ వెల్లడైన ఫలితాలను ఉదాహరణగా తీసుకోవచ్చిని బీఆర్ఎస్ భావిస్తుండటం గమనార్హం.

చెన్నూర్ ఓటర్లు ఎటు వైపు

చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు ఏర్పాటు వైపు మొగ్గు చూపారు. ఏ పార్టీకి పట్టం కట్టబోతున్నారో అన్న ఉత్కంఠ సర్వత్రా కన్పిస్తోంది. పోలంగ్ పూర్తయింది మొదలు ఎక్కడ నలుగురు కలిసినా అభ్యర్థుల గెలుపోటముల విషయంలో చర్చించుకోవడం కన్పిస్తోంది. గతంలో ఎన్నడు లేనివిధంగా ఈ సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు నిశాబ్దాన్ని పాటించారు. ఓటరు నాడి అంతు చిక్కకుండా ఉండటంతో గెలుపు ఎవరిని వరిస్తోందో తేల్చి చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈవీఎం బాక్కులు ఓపన్ చేస్తే తప్పా గెలుపును పసికట్టలేని పరిస్థితి నెలకొంది.

పురుషులతో సమంగా ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు

చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో లక్ష 88 వేల 201 ఓటర్లు ఉండగా పురుషులు 94,074 స్త్రీలు 94,201 పురుషుల కంటే స్త్రీ ఓటర్లు 137 అధికంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో పుషులతో సరిసమంగా స్త్రీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో వితంతు, వికలాంగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీద్దులు, గృహిణులు, యువతులు ఉన్నారు. వీరంతా ఏదో ఒకరంగా ప్రభుత్వ పరమైన సంక్షేమ పథకాలు ఫలాలు పొందివుంటారు. ఈ క్రమంలో స్త్రీ ఓటర్లు అధికార బీఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపుతారన్న ధీమా సదరు పార్టీ నాయకులు కార్యకర్తల్లో కన్పిస్తోంది. ఏది ఏమైనా ఓటరు తీర్పును గౌరవించాల్సిన అభ్యర్థుల భవితవ్యం మరి కొద్ది గంటల్లో బయటపడనున్న తీర్పు కోసం వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కౌన్ బనేగా ఆదిలా'బాద్' షా

• విజయం ఎవరిని వరించేనో? • ప్రమాణ స్వీకారం చేసేదెవరో? • గెలుపుపై ఎవరి ధీమా వారిదే • నేడు తేలనున్న భవితవ్యం









నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ముగిసింది. ఇక ఎవరు గెలుస్తారో అనేది నేడు ఫలితాల్లో తేలనుంది. ఆదిలాబాద్ నియోజకవర్గం నుండి చూస్తే ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ ఉండనున్నట్లు తెలుస్తోంది. మేము గెలుస్తున్నామంటే, మేము గెలుస్తున్నామంటూ ఎవరికి వారే ధీమాలో ఉన్నారు. కాగా ఓట్ల లెక్కింపుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు జిల్లా కేంద్రంలోని టీటీడీసీ కేంద్రంలో ఓట్లను లెక్కింపు చేపట్టనున్నారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. మొదటగా ఎనిమిది గంటల నుండి 8.30 వరకు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఓట్లు లెక్కింపు చేయనున్నారు. అనంతరం ఈవీఎం ఓట్ల లెక్కింపు చేయనున్నారు. కాగా నియోజకవర్గంలో బీజేపీ గెలుపుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లుగా కనిపిస్తుంది. బయట ఎవరిని అడిగిన అందరి నోట బీజేపీనే వినిపిస్తోంది. అభ్యర్థులు సైతం తమ కార్యకర్తలతో కూర్చొని ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు.

గెలుపుపై బీజేపీ ధీమా

నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాయల్ శంకర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జోగురామన్న మీద పోటీ చేసి మూడు సార్లు వరుసగా ఓటమి పాలయ్యారు. కాగా నాలుగవ సారి పోటీలో ఉండగా ఈ సారి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈసారి తమకు అనుకూలంగా ఓట్లు పెరిగాయని భావిస్తున్నారు. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో బీసీ ఓట్లు, ఎస్సీ వర్గీకరణ కమిటీతో మాదిగల ఓట్లు, యువత, కొత్త ఓటర్లు సైతం తమకే వస్తాయని అంచనాలు వేస్తున్నారు. ఇక నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి వెళ్లేదెవరో తెలనుంది.

5వ సారి గెలిచి హైట్రిక్ కొట్టేనా..?

నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా జోగురామన్న నాలుగు సార్లు పోటీ చేసి గెలిచారు. 2018 ఎన్నికల్లో 24 వేలకు పైగా మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదవసారి కూడా తమదే విజయం అన్నట్టుగా ధీమాలో ఉన్నారు. పోలింగ్ ముగిసిన మరుసటి రోజు కార్యకర్తలు, నాయకులతో కలిసి లెక్కలు వేసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమను మెజారితో గెలిపిస్తాయని చెబుతున్నారు. ఈ సారి కూడా గెలిచి 5వ సారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తారని జోరుగా చర్చించుకుంటున్నారు. ఈసారి రామన్న గెలిస్తే మంత్రి పదవీ కూడా వస్తుందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

ఎన్ఆర్ఐ ఎమ్మెల్యే అయ్యేనా..?

నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కంది శ్రీనివాస్ రెడ్డి ఎన్ఆర్ఐగా ఉన్న ఆయన రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. తమ మేనిఫెస్టో ఆరు గ్యారంటీలతో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుస్తున్నామని ధీమాలో ఉన్నారు. కాంగ్రెస్‌కు తక్కువ మంది ఓటేశారని బయట ప్రజలు మాట్లాడుకుంటున్నారు. రాజకీయ అనుభవం లేదని, ఇటీవలే పార్టీ మారారని, కాంగ్రెస్ నుండి రెబల్ అభ్యర్థిగా సంజీవ రెడ్డి పోటీ చేయడంతో ఓట్లు చీలాయని బయట జోరుగా చర్చ నడుస్తోంది. మొత్తానికి ఇవాళ ఎవరు కింగ్ అనేది తెలిసిపోతుంది.

ఓట్ల లెక్కింపు వద్ద 144 సెక్షన్ అమలు

• మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులపై ఆంక్షలు • కేఆర్కే కాలనీ వాసులకు దారి మళ్లింపు



ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం కొనసాగనుంది. లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా ఏర్పాట్లను చేశారమని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లెక్కింపు ప్రక్రియ కొనసాగే స్థానిక టీటీడీసీ ప్రాంగణం ఒక కిలో మీటర్ల చుట్టుపక్కల ప్రాంతం అంతా నిషేధాజ్ఞలు కొనసాగుతాయని తెలిపారు. ఎన్నికల లెక్కింపు పూర్తి అయ్యేంత వరకు జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు, బెల్ట్ షాపులు నిర్వహించకూడదని, కౌంటింగ్ హాల్ అనుమతి పాస్ ఉన్నవారు మాత్రమే కౌంటింగ్ హాల్ పరిసరాలకు రావాలన్నారు. కౌంటింగ్ హాల్ పాసెస్ ఉన్న ఏజెంట్లు సెల్ ఫోన్లు, అగ్గి డబ్బా, ఇంకు బాటిల్, లాంటి అనుమతి లేని వస్తువులను తీసుకురాకూడదన్నారు. కేఆర్‌కే కాలనీవాసులు మావల పోలీస్ స్టేషన్ మీదుగా తిరుమల పెట్రోల్ బంక్ ముందు ఉన్న రోడ్డును వినియోగించుకోవాలని దారిని మళ్లించినట్లు తెలిపారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత 24 గంటల వరకు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, టపాసులకు అనుమతి లేదన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు గుమ్మిగుడి ఉండటానికి అనుమతి లేదన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగం కౌంటింగ్ హాల్‌లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి, పరిసర ప్రాంతాలలో పటిష్ట బందోబస్తుతో సజావుగా ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి మనిషి జీవితంలో తప్పు చేయడం సర్వసాధారణమని దానిని చేయడానికి వచ్చిన పరిస్థితులు తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. క్షణికావేశంలో చేసిన చిన్న తప్పు జీవితంలో ఎన్నో కోల్పోవడానికి కారణం అవుతుందన్నారు. వ్యక్తి తనపై తాను నిగ్రహం సాధించాలంటే ప్రతి రోజు మెడిటేషన్ చేయాలన్నారు. దీనివల్ల పనిపై శ్రద్ధ పెరగడంతో పాటు, తప్పు చేసే అవకాశాలు తగ్గుతాయన్నారు. జైలు జీవితం ఖైదీలో పరివర్తన తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి ప్రేమ్ కుమార్, డిప్యూటీ చీఫ్ వెంకటేశ్వర్లు, లీగల్ అసిస్టెంట్ అంజనీదేవి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-బోథ్

రైతు బంధును వెంటనే విడుదల చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బోర్రన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రబిలో రైతు బంధు రాని రైతులకు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలన్నారు. జిల్లాలో శనగ, మొక్కజొన్న, తెల్ల జొన్న, ఎర్రజొన్న పండిస్తున్న రైతులకు నవంబర్ నెలలోనే విడుదల చేయల్సి ఉండేదన్నారు. రైతు బంధు నిధులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విడుదల చేయకపోవడంతో వారికి అందలేదన్నారు. పంట రుణాలు మాఫీ కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ యాసంగి రబి పంటపెట్టుబడి ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతులు స్వామి, రాజు, నారాయణ్, రామారావు పాల్గొన్నారు.

దక్షిణభారత సైన్స్ డ్రామా పోటీల్లో ఆదర్శ విద్యార్థులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు దక్షిణ భారత సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ మ్యూజియంలో నవంబర్ 23 నుండి 25 వరకు నిర్వహించిన సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో "మిల్లెట్స్- ది సూపర్ ఫుడ్" అంశంపై డ్రామా ప్రదర్శించారన్నారు. ఈ సందర్భంగా శనివారం వారిని ఆయన అభినందించి మాట్లాడుతూ పోటీలకు సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ మార్గదర్శకం చేయగా, స్క్రిప్ట్ వర్క్‌ను పాఠశాల టీజీటీ కవ్మే శోభ పూర్తి చేశారన్నారు. ఈ డ్రామా మన భారతీయ మిల్లెట్స్ క్వీన్ బ్రాండ్ అంబాసిడర్ లహరి బాయి నిజా జీవిత కథ ఆధారంగా రూపొందించారని తెలిపారు. నాటకంలో విద్యార్థులు కొండు అక్షిత, ముంజం అక్షిత, మనస్విని, బండ నేత్ర, సామల



వేదాక్షర, గుండేటి భవన, మనేం అక్షిత, జంజిరాల పల్లవి, పాల్గొన్నాంని, ప్రభుత్వ పాఠశాల నుండి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి దక్షిణ భారత స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని తెలిపారు.